ప్రజాశక్తి
శనివారం 16 మార్చి 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు

ముంచుతున్న నకిలీ

- బరితెగించి అమ్ముతున్న డీలర్లు
- అనుమతి లేకున్నా నమ్మించి నకిలీ బిల్లులు
- ఒక్కో రైతుకు నష్టం రూ.లక్షల్లోనే
- తెలిసినా మిన్నకుంటున్నారని అధికారులపై ఆరోపణలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యవసాయం కోసం అధిక వడ్డీలకు అప్పులు చేసి.. భార్య తాళిసహా ఇంట్లో ఉన్న బంగారపు వస్తువులన్నింటినీ అమ్మి పెట్టుబడి సమకూర్చుకునే రైతులను నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు నిండా ముంచుతున్నాయి. చంటి బిడ్డలా సాకును సాకుతున్నా ఆశిస్తున్న తెగుళ్లు, పురుగుల నుండి పైరును కాపాడుకోవడానికి రైతులు పడే యాతన అంతాఇంత కాదు.. దీన్నే వ్యాపారులు సొమ్ము చేసుకుంటూ నకిలీలను అంటగడుతున్నారు. వ్యవసాయ శాఖాధికారుల సహకారంతోనే అక్రమార్కులు రెచ్చిపోతూ రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్నారు. అయితే కొంతమంది రైతులు మాత్రం తమకు జరిగిన అన్యాయాన్ని పోలీసులు, ప్రజాప్రతినిధులను విన్నవించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

తనిఖీల్లో పట్టుబడ్డ నకిలీ బయో ఉత్పత్తులు (ఫైల్)

పల్నాడు జిల్లా మొత్తంగా బయో పురుగు మందుల వ్యాపారం రూ.70 కోట్ల వరకూ ఉంటుందని అంచనా కాగా ఇందులో 90 శాతం మందులు నకిలీవని సమాచారం. ఒక్క నరసరావుపేటలోనే 20కుపైగా బయో పురుగు మందుల దుకాణాలున్నాయి. వీటిల్లో సీజన్‌కు రూ.30 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా కాగా ఇందులో 90 శాతానికి పైగా నకిలీ మందులే విక్రయిస్తారని తెలిసింది. ఈ ఉత్పత్తులు పేరుతో చలామణీ అయ్యే కంపెనీల్లో 100 ఉంటే అందులో నాలుగైదు కంపెనీలకు మించి అనుమతులు ఉండవు. అయినా ఆ మందులనే రైతులకు అంటగట్టి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. విత్తన దుకాణాలు నరసరావుపేట పట్టణంలో 20 వరకూ ఉన్నాయి. వీటిల్లో సీజన్‌కు రూ.40 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా కాగా ఇందులో

2లో

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం పరగటిచర్ల మండలంలోని పొలాల్లోకి ఒక కారు వచ్చి ఆగింది.. అందులో నుండి టక్కు చేసుకుని టిప్‌టాప్‌గా రెడీ అయిన ఒకరు దిగి సమీపంలోని రైతులను పిలిచాడు. ఏం పంట ఎంత వేస్తున్నారు.. అని గౌరవంగా అడిగి ఆకట్టుకున్నాడు. సాగులో ఇబ్బందులు కొన్ని మాట్లాడి తమ కంపెనీ మందులు వాడటం ద్వారా అధిక దిగుబడి వస్తుందని, మిర్చిలో తెగుళ్లు పురుగులు ఆశించవని నమ్మించారు. దీంతో మందపాటి వెంకటేశ్వర్లు అనే కౌలురైతు రూ.4 లక్షల మందులు కొనుగోలు చేశారు. ఆ మందులు వేసిన తర్వాత మిర్చి తోట లోపించింది. రూ.6.50 ఎకరాలకు పెట్టిన రూ.15 లక్షల పెట్టుబడి మట్టిపాలైంది. తనకు జరిగిన అన్యాంపై బాధితుడు పోలీస్‌స్టేషన్, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగడంతోపాటు 'జగనన్నకు చెబుదాం'లోనూ ఫిర్యాదు చేసినా న్యాయం దక్కక దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.

తాను కొన్న మందులను రొంపిచర్ల మండలం పరగటిచర్లకు చెందిన కౌలురైతు మందపాటి వెంకటేశ్వర్లు

గోదాములో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నకిలీ ఆర్గానిక్ ఉత్పత్తుల తయారీ కేంద్రంలో తనిఖీలు

రూ.1.47 కోట్ల సరుకు, సామగ్రి స్వాధీనం

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పేరేచర్లలో నకిలీ ఆర్గానిక్ ఉత్పత్తుల తయారీ కేంద్రంపై విజిలెన్సు - ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులకు శుక్రవారం మెరుపు దాడులు చేశారు. రూ.కోటీ 47 లక్షల 73 వేల 476 సరుకును స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల గ్రామంలోని నికిత కిసాన్ సేవా కేంద్రంలో తనిఖీ చేపట్టారు. ఫరమ్ వ్యాపారికి పురుగు మందులు, ఎరువులు విక్రయానికే అనుమతి ఉండగా బిల్లులు, ఇన్వాయిసులు లేకుండా రసాయనిక ముడిపదార్ధములు తెచ్చి, సేంద్రీయ ఉత్పత్తుల ముసుగులో రసాయనాలు కలిపి నకిలీ మందులు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అనుమతి లేని 5 రకాల ముడిపదార్థాలను గుర్తించారు. ఇక్కడే మందులను తయారు చేసి అమ్మటానికి కావలసిన అట్టపెట్టెలు, ఖాళీ సీసాలు, ప్యాకింగ్ సామగ్రి, లేబుళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ శివప్రసాద్ అనే వ్యక్తిపై ఇన్వాయిస్ చేయబడి ఉన్నట్లు గుర్తించారు. గొదాములోని రూ.కోటీ 47 లక్షల 32 వేల 256 విలువగల సేంద్రీయ పదార్తాళు, రూ.41,220 విలువగల ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. సంస్థ యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయించాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.నాగరాజును ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెర్ అగ్రికల్చరల్ అధికారి కె.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, విఆర్ఒ, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

గ్రూప్-1 పరీక్ష ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో గ్రూప్-1 పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై లైజనింగ్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెంట్లతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-1 ఉద్యోగుల నియామకం కోసం ఈనెల 17న జరిగే పరీక్షలకు జిల్లాలో 23 పరీక్షా కేంద్రాల్లో 15,040 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్ 2 పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాలను లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెంట్లు మరోసారి పరిశీలించి మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో వైద్యశిబిరాల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. జేసీ రాజకుమారి మాట్లాడుతూ అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు పేపర్-1 పరీక్షకు ఉదయం 9 గంటల నుంచి 9.30 వరకు గ్రేస్ పిరియడ్ 15 నిమిషాలు కలిపి 9.45 వరకు, పేపర్ 2 పరీక్షకు మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 వరకు గ్రేస్ పిరియడ్ 15 నిమిషాలు కలిపి 1.45 వరకు మాత్రమే అనుమతించాలని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు మెబైల్ ఫోన్లు, ఎలక్ట్రానికి గ్యాడ్జెట్‌లు తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ పి.రోజా, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ (మానిటరింగ్) ఎన్.ప్రమీళ, సెక్షన్ ఆఫీసరు ఎస్.ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శనివారం సాయంత్రం) : 6.23
సహరీ (ఆదివారం ఉదయం) : 4.58

ఏర్పాట్లను పరిశీలిస్తున్న పత్తిపాటి పుల్లారావు

జనగళం సభకు తుది దశలో ఏర్పాట్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండలంలోని బొప్పూడిలో టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో ఆదివారం జరిగే ఉమ్మడి బహిరంగ సభ (జనగళం)కు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నట్లు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. విఐపి గ్యాలరీ, ఇతర పనులను శనివారం సాయంత్రానికి పూర్తి చేస్తామన్నారు. హెలీప్యాడ్లు, విఐపి గ్యాలరీ, వాహనాల పార్కింగ్, బ్యారికేడ్లు దాదాపు పూర్తవ్వొచ్చాయన్నారు. విఐపిల కోసం ప్రత్యేకంగా ఏడు హెలిప్యాడ్లను సిద్ధం చేశామన్నారు. గతంలో ప్రధానులుగా చేసిన ఇందిరా గాంధి, పీవీ నరసింహారావు చిలకలూరిపేటకు వచ్చారని, ఇప్పుడు మోడీ వస్తున్నారని అన్నారు. ప్రధాని తొలుత ప్రత్యేక విమానంలో బాపట్ల జిల్లా కోరిశపాడు మండలం

2లో

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- హాజరు కానున్న 31,291 మంది విద్యార్థులు
- హాల్ టిక్కెట్ చూపితే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం : డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు

విలేకర్లకు వివరాలు చెబుతున్న డిఇఒ

జిల్లాలో ఈనెల 18వ తేదీ నుండి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ తెలిపారు. దీనిపై శుక్రవారం డిఇఒ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 గంటల నుండి 12.45 గంటల వరకూ పరీక్ష ఉంటుందని, విద్యార్థులను 8.45 నుండి 9.30 గంటల వరకూ పరీక్షా కేంద్రలోకి అనుమతిస్తారని చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష ముగింపు సమయం పూర్తయ్యే వరకూ పరీక్షా కేంద్రంలోనే ఉండాలని, బయటకు అనుమతించరని అన్నారు. రెగ్యులర్ విద్యార్థులు బాలికలు 13,046 మంది, బాలురు 14,320 మంది మొత్తం 27,366 మంది హాజరవుతున్నారని తెలిపారు. ప్రైవేటు విద్యార్థులు/ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు బాల బాలికలు 3925 మంది ఉన్నారన్నారు. 147 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, చీఫ్ సూపర్నెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, స్కాడ్స్ నియమించామని చెప్పారు. చీఫ్ సూపర్నెంట్లు, ఇన్విలేటర్లు ఎవరి దగ్గరా మొబైల్స్ ఉండవన్నారు. ఎక్కడా ఫర్నీచర్ కొరత లేదన్నారు. హాల్‌టిక్కెట్ చూపిస్తే ఆర్టీసిలో సెంటర్‌కు ఉచితంగా వెళ్లి రావచ్చన్నారు. పేపర్ లీకేజి వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పేపర్ లీకేజికి ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో గవర్నమెంట్ ఎగ్జామ్స్ జిల్లా సహాయ కమిషనర్ వెంకటరెడ్డి, ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఇఒ బలరామ్‌నాయక్, ఉర్దూ డిఐ ఖాసిం పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో రూ.2.80 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ఈ క్రాప్ బుకింగ్ పత్రాలను రైతులకు అందజేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

ఈ-క్రాప్ బుకింగ్ పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలోని వడ్లమూడివారిపాలెంలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ క్రాప్ బుకింగ్ పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డిడిఎ శివకుమారి పాల్గొని మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ ద్వారా పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని, రైతులకు అనేక రకాల ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఎ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి శివ లలిత పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

'ఓట్లు మావే సీట్లు మావే' అని నినదించిన మహోన్నత వ్యక్తి కాన్షీరామ్ అని బీసీ సంఘం నాయకులు చింకా అంకమ్మరావు అన్నారు. స్థానిక ఎన్‌జిఒ సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కాన్షీరామ్ 90 వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మ రావు మాట్లాడుతూ 'ఓట్లు మావే..సీట్లు మావే' అనే నినాదంతో బహుజనులను అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత కాన్షీరామ్‌కే దక్కిందన్నారు. కుల వ్యవస్థను అంతం చేయాలనే లోతైన కోరికతో నడిచిన నాయకుడని, అణచివేతకు గురవుతున్న వారందరినీ మాట్లాడేందుకు, ఇతరుల హక్కుల కోసం పోరాడేందుకు అనుమతించే వేదికను సృష్టించారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు గుంటూరు గోవిందు, పోతుల ప్రకాష్ రావు, కుమ్మరి దస్తగిరి, చావల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ప్రజాశక్తి - మాచర్ల

మండల కేంద్రమైన దుర్గి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలోగజాపురం తండాకు చెందిన మెగావత్ సోమలా నాయక్ (33) మృతి చెందాడు. గజాపురం తండా నుండి దుర్గి గ్రామానికి వచ్చి వ్యవసాయ పనులకు అవసరమైన సామాగ్రి కొనుక్కొని తిరిగి గజాపురం వెళుతుండగా ఊరు బయట పెట్రోల్ బంకు వద్ద టాటా మ్యాక్స్ వాహనం ఢీకొనడంతో నాయక్ మతి చెందాడు.మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దుర్గి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పశువుల కాపరులపై దాడి

ప్రజాశక్తి - మాచర్ల



ముగ్గురికి గాయాలు. తెలంగాణ ప్రాంతం నుండి గొర్రెలు మేపుకునేందుకు వచ్చిన గొర్రెలు కాపర్లపై ఈ ప్రాంతంలోకి ఎందుకు వచ్చారంటూ గొడవ పెట్టుకుని దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి బాధితుడు పల్లె ఆంజనేయులు మాట్లాడుతూ తనతోపాటు కడారి రవి మేడమ్ ఎల్లయ్యలు గంగలకుంట ప్రాంతంలో గొర్రెల మేపుకునేందుకు వచ్చామని తెలిపాడు. స్థానికంగా ఉండే గొర్రెలు కాపర్లు మా ప్రాంతానికి ఎందుకు వచ్చారంటూ మాతో గొడవపడి మా పై దాడి చేశారని తెలిపారు. మాది తెలంగాణ ప్రాంతంలోని నాగర్ కర్నూల్ జిల్లా పదర అని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా గొర్రెల మేపు కునేందుకు ఈ ప్రాంతానికి వస్తుంటామని పంట అయిపోయిన పొలాలను కొనుక్కొని గొర్రెల మేపుకుంటామన్నారు. గాయాలపాలైన వారికి మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించారు ఈ మేరకు పట్టణంలోని ఎన్‌యు హెచ్‌ఎం నిధులు రూ.80 లక్షలతో నిర్మించిన మూడు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల (రూ.2.40 కోట్లతో) ను, మునిసిపల్ నిధులు రూ. 40 లక్షలతో నిర్మించిన ఎనిమిది వ్యాపార సముదాయ దుకాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ గత 48 నెలల్లో పట్టణంలో ప్రశాంతమైన వాతావరణంలో పరిపాలన అందించామన్నారు. యువ ముఖ్యమంత్రి జగన్ విద్యా , వైద్య రంగాల్లో చేపట్టిన సంస్కరణల ఫలితంగా పేదవాని ఆరోగ్యానికి సాయం అందించామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో కూడా నాడు- నేడు ప్రవేశపెట్టి అధునాతన సౌకర్యాలు, వనరులు కల్పించామన్నారు. ఇంటింటికి వైద్యం, వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఆరోగ్య రక్షణ కల్పించామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ ల ద్వారా పేద వర్గాలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ముందుగా శిలా ఫలకాలు ఆవిష్కరించి భవనాలను ప్రారంభించారు.

కాకతీయ కళ్యాణ మండపం సమీపంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఇంటి కప్పుపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి కృషి

- రూ.30 వేలు నుండి రూ 78 వేల వరకు సబ్సిడి
- విద్యుత్ శాఖ ఇఇ జె హరిబాబు

ప్రజాశక్తి-మాచర్ల

విద్యుత్ వినియోగదారులు తమ ఇంటి కప్పుపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంపు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని విద్యుత్ శాఖ ఇఇ జె హరిబాబు తెలిపారు. తన కార్యాలయంలో మాచర్ల డివిజన్ స్థాయి అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇఇ హరిబాబు మాట్లాడుతూ పిఎం సూర్య ఘర్ ముఫ్త్ యోజన పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం ఇంటి కప్పుపై సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు రూ.340 కోట్లు సబ్సిడిని కేటయించినట్లు తెలిపారు. ఇంటి కప్పుపై 1 కిలో వాట్ నుండి 3 కిలో వాట్స్ వరకు విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు ఈ పథకం కింద అవకాశం ఉందన్నారు. రూ 30వేల నుండి రూ 78 వేల వరకు ప్రభుత్వ సబ్సిడికి అవకాశం ఉందన్నారు. వినియోగం తరువాత ఉండే అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు అమ్మకం చేయడం ద్వారా పెట్టుబడిని 5 నుండి 6 సంవత్సరాలలోపు తిరిగి పొందవచ్చని చెప్పారు. ఆసక్తిగల వినియోగదారులు నేషనల్ పోర్టల్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చుని, ఇప్పటికే నేషనల్ పోర్టల్ ద్వారా 59 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. మాచర్ల డివిజన్ పరిధిలో 300 మంది సోలార్ విద్యుత్ ఉత్పత్తి పట్ల ఆసక్తి చూపుతూ దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి కాలుష్య రహితమన్నారు. రానున్న రెండేళ్లలో ఆర్‌డిఎస్ పథక ద్వారా గ్రామీణ ప్రాంతాలలో కూడ 24 గంటలు గృహ విద్యుత్ ఇచ్చేందుకు అగ్రికల్చర్ విద్యుత్ లైన్లను వేర్వురుగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపులో ఉన్నందున వినియోగదారులు తమ బకాయిల వెంటనే చెల్లించి అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు సహకారం అందించాలన్నారు. సమీక్ష సమావేశానికి గుంటూరు నుండి ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ ఎకౌంట్స్ అధికారి రామిరెడ్డి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ టారిఫ్‌లలో ఎలాంటి మార్పు లేదన్నారు. ఎస్.సి, ఎస్.టిలు ఆధార్ జిరాక్స్‌తో తమ వద్దకు వస్తే వారికి ఉచితంగా సులభతరంగా సర్వీసులు ఇస్తామన్నారు. అధికారులు మస్తాన్ వలి, రాంబాబు, కోటేశ్వరరావు, చంద్రశేఖర్, రామేశ్వర నాయక్, మత్రునాయక్, శ్రీనివాసరెడ్డి, ఎస్ శ్రీనివాస రావు, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య విధానంలో విప్లవాత్మకమైన సంస్కరణలు

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య వర్సిటీ విసి డాక్టర్ కె.బాబ్జి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆంధ్రప్రదేశ్ వైద్య విధానంలో విప్లవాత్మకమైన సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని డాక్టర్ వైయస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంబిఎ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్మెంట్‌లి అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి డాక్టర్ బట్టు నాగరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త డాక్టర్ బాబ్జి మాట్లాడుతూ సంక్రమణ వ్యాధులను వైద్యరంగం సమర్థవంతంగా ఎదుర్కొంటూనే అసంక్రమణ వ్యాధుల విషయంలో తీసు కోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆరు మెడికల్ కాలేజీలను నూతనంగా అందుబాటులోకి తీసుకురానుందని అన్నారు. ఈ ఏడాది నుంచి ఎండి హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులను ప్రవేశాఎట్టనున్నట్లు చెప్పారు. వీసి మాట్లాడుతూ హెల్త్ కేర్ వ్యాపారం రానున్న కాలంలో బహుముఖంగా విస్తరించి ఉందని అన్నారు. విశిష్ట అతిథి శ్రీ వెంకటేశ్వర హెల్త్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ ఆర్. వి. కుమార్ మాట్లాడుతూ పారిశ్రామిక , వ్యాపార రంగాలు సాంకేతిక పరిజ్ఞానంతో పెనవేసుకున్నాయని అన్నారు. అనంతరం సదస్సు డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు మాట్లాడారు.

ముంచుతున్న నకిలీ

(మొదటి పేజీ తరువాయి)

20 శాతం 8 కోట్ల వరకూ నకిలీ విత్తన వ్యాపారమే ఉంటుంది.

బయో కెమికల్ పేరుతో అనుమతి లేని నకిలీ ముందులను వ్యాపారులు చాటు మాటుగా అమ్ము తూ రైతులను నట్టేట ముంచుతున్నారు. పల్నాడు జిల్లాను నకిలీ బయో ఉత్ప త్తులు ముంచెత్తాయి. తెలంగాణ రాష్ట్రం నుండి వస్తున్న ఈ ఉత్పత్తులు వివిధ రకాల కంపెనీల పేరుతో జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. లైసెన్సు లేని వ్యాపారులు, రైతులతో సంబంధాలున్న కొందర్ని ఎంపిక చేసుకుని లాభాల ఆశ చూపి వారి ద్వారా ఆయా మందులను రైతులకు అంటగడుతున్నారు. అమ్మకాలను బట్టి కమీషన్లతో పాటు బంగారం, వెండి నాణేలు ఇస్తూ అక్రమ వ్యాపారాన్ని మరింతగా విస్తరిస్తున్నారు. ఈ ఎరువుల ద్వారా తెగుళ్ల, పురుగు నివారణతోపాటు పైరుకు ఇతర పోషకాలు నేరుగా అందుతాయిని, పూత, దిగుబడి అధికంగా వస్తుందని నమ్మబలుక ుతున్నారు. చిన్న మందు డబ్బా తయారీకి రూ.20 వరకు అవుతుండగా దాన్ని రూ.ఐదారు వందులకు అమ్మి అక్రమంగా అర్జిస్తున్నారు.



కౌలురైతు మందపాటి వెంకటేశ్వర్లుకు దుకాణదారులు ఇచ్చిన నకిలీ బిల్లు

రైతులను మోసం చేయడానికి ఉత్పత్తిదారులు తొలుత డీలర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ ఉత్పత్తులను ఎక్కువగా అమ్మిన వారికి అధిక కమీషన్లు, బంగారు నాణేలు ఇస్తామని ఆశ చూపుతున్నారు. వీటికి ఆశపడిన డీలర్లు.. తమకు రైతులతో ఉన్న పరిచయాలను ఉపయోగించి వారితో బయో ఉత్పత్తులను కొనిపిస్తున్నారు. అయితే రైతులకిచ్చే బిల్లులను అసలైనవి కాకుండా కోటేషన్ రూపంలో ఇస్తున్నారు. తీరా రైతు మోసపోయినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నాడు. విత్తనాల విషయంలో రైతులను మరో తరహాలో మోసం చేస్తున్నారు. డీలరే ఒక కంపెనీ విత్తనాలను రైతుల ద్వారా సాగు చేయించి ఆ పంట నుండి వచ్చిన విత్తనాలను ప్రాసెస్ చేయించి మళ్లీ అమ్ముకుంటున్నారు. ఇలా ఎకరాకు ఐదు కిలోలు ఇచ్చి వాటి నుండి వచ్చే 50-70 కిలోలను రూ.లక్షల్లో అమ్ముతున్నారు. కొన్ని కంపెనీలైతే ఒక సీజన్‌లో అమ్ముడవని విత్తనాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి వాటిని మరుసటి సీజన్‌లో కొత్త విత్తనాలతో కలిసి అమ్ముతున్నారు. అయితే వీరిపై పూర్తిస్థాయిలో నిఘా, కఠిన చర్యలు కరువయ్యాయి.

నకిలీ విత్తనాలతో నష్టపోయా

చెన్నంశెట్టి సాంబశివరావు, కౌలు రైతు, కట్టుబడివారిపాలెం, చిలకలూరిపేట మండలం.

1.60 ఎకరాల్లోని మిరప తోటకు కౌలు, పెట్టుబడి మొత్తం రూ.2 లక్షల వరకు ఖర్చయింది. నకిలీ మిరప విత్తనాలతో తోట ఎదుగుదల లోపించింది. శాస్త్ర వేత్తలు వచ్చి పరిశీలించి నకిలీ విత్తనాలుగా గుర్తించారు. విత్తన దుకాణ యజమాని కానీ విత్తన కంపెనీ ప్రతినిధులు స్పందించలేదు.

జనగళం సభకు తుది దశలో ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

రేణంగివరం వద్దకు వస్తారని, ఇందుకోసం ప్రత్యేకంగా రన్‌వేను ఏర్పాటు చేశారని చెప్పారు. రేణంగివరం నుండి సభా వేదిక వద్దకు హెలికాప్టర్‌లో వస్తారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అతిపెద్ద భారీ సభగా ఇది నిలుస్తుందని, ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో ఒక్కో జిల్లా నుండి నియోజకవర్గానికి 5-10 వేల మంది ద్విచక్ర వాహనాలపై రావాలని చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. ఆర్టీసీ బస్సులు ఇస్తామని చెప్పిన అధికారులు తాము అడిగినన్ని ఇవ్వడం లేదని అన్నారు. సభకు వచ్చే వారికి ఇబ్బందులేమీ తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభలో మోడీ, చంద్రబాబు, పవన్‌తోపాటు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, ఎమ్మెల్యే బాలకృష్ణ, మూడు పార్టీల ప్రధాన నాయకులు హాజరవుతారని చెప్పారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఆటో

- ముగ్గురికి తీవ్రగాయాలు,
- డ్రైవర్ పరిస్థితి విషమం.. గుంటూరుకు తరలింపు

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో, ఘటనా స్థలంలో క్షతగాత్రులు

తెనాలి జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న అభినయ్

ప్రజాశక్తి-తెనాలి

ప్రయాణీకులతో వెళుతున్న ఆటో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంకాగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. రూరల్ పోలీసులు, క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం మున్నంగి గ్రామానికి చెందిన పది మంది శుక్రవారం ఆటోలో తెనాలి రూరల్ పరిధిలోని కఠెవరానికి వచ్చారు. అక్కడ బంధువు చనిపోవటంతో ఆ కార్యక్రమంలో పాల్గొని తిరిగి మున్నంగి వెళ్ళేందుకు ఆటోలో బయలుదేరారు. కఠెవరం లోంచి తెనాలి-విజయవాడ మెయిన్ రోడ్డుకు చేరిన ఆటో, ఆటోనగర్ సమీపంలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. దీంతో ఆటో నుజ్జు నుజ్జయింది. ప్రమాద సమయంలో ఆటోలో డ్రైవర్, మరో పది మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ వేమూరి నాగరాజు సీట్లోనే ఇరుక్కుపోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. అతనితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న వేమూరి మల్లేశ్వరి, గురిందపల్లి అభినయ్(10), గురిందపల్లి నవతేజ్(9)కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 అంబులెన్స్ సాయంతో క్షతగాత్రులను తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ నాగరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. మిగిలిన వారంతా తెనాలి జిల్లా వైద్యశాల్లో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రం కోసం చంద్రబాబు నిర్ణయాన్ని గౌరవిస్తా

మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్



ప్రజాశక్తి -బెల్లంకొండ

రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నామని, ఈ సమయంలో రాష్ట్రానికి చంద్రబాబు అవసరం ఉంది కనుక ఆయన నిర్ణయాన్ని గౌరవిస్తానని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం కొమ్మాలపాటి శ్రీధర్ ని చంద్రబాబు ఉండవల్లి లోని తన నివాసానికి పిలిపించుకొని మాట్లాడారు. టికెట్ కేటాయింపు విషయంలో కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సర్దుబాటు చేయలేకపోయానని, భవిష్యత్తులో సముచిత స్థానం కల్పించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎప్పటిలానే పార్టీకి సేవలందించాలని కోరారు. చంద్రబాబు నిర్ణయాన్ని గౌర విస్తానని తెలిపారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటోందని, అందరి బాగు కోసం టిడిపి గెలుపు అవసరమని అన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం ఎత్తిపోతలలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థినులకు సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రి అందజేశారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం పరీక్ష సామగ్రి పంపిణీ చేసి నట్లు పేర్కొన్నారు. మరనాత వెల్లటూరు యేసయ్య సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జి.దుర్గాభవాని,వార్డెన్ టి.వెంకటేశ్వరు పాల్గొన్నారు.

బంగారు వస్తువులు, నగదు చోరీ

ప్రజాశక్తి-మాచర్ల

ఎవరు ఇంట్లో లేని సమ యంలో గురువారం రాత్రి పూట తాళాలు పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఆప హరించిన ఘటన పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న డ్రైవరు బాల య్య ఇంట్లో జరిగింది. ఈ సందర్భంగా బాలయ్య, అతని భార్య మాట్లాడుతూ పగటి పూట ఇక్కడ ఇంట్లో ఉంటామని, రాత్రి సమయంలో తాను చిన్న కోడలు ఇంట్లో, తన భార్య పెద్ద కోడలు ఇంట్లో నిద్రించేందుకు వెళతామని చెప్పారు. రోజుమాదిరిగానే గురువారం రాత్రి కూడా తాము వెళ్ళి శుక్రవార ఉద యం ఇంటికి వచ్చి చూడగా, తాళాలు పగలగొట్టి ఇంట్లో బీరువాలు పగలగొట్టి రూ 2.50 లక్షల విలువ గల బంగారు వుంగరాలు, చెవి దిద్దులు, వెండి పట్టాలు, గోగుత్రాడు తదితర వస్తువులు, నగదు రూ20వేలు, మొబైల్ ఫోన్ దొంగిలిచినట్లు గుర్తించినట్లు చెప్పారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వేలిముద్రలు సేకరించే నిపుణులు వస్తారని తెలిపినట్లు బాలయ్య వివరించారు.

'కనెక్ట్ విత్ కన్నా' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కనెక్ట్ విత్ కన్నా పోస్టర్ ను టిడిపి అభ్యర్థి కన్నా లక్ష్మీ నారాయణ ఆవిష్కరించారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘు రాం నగర్ టిడిపి ప్రజావేదికలో ఐటిడిపి ఆద్వర్యంలో రూపోందించిన కనెక్ట్ విత్ కన్నా పోస్టర్ ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ దీని ద్వారా ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చిన గ్రామ స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గం స్థాయిలో ఎటువంటి సమస్యలు పరిష్కరించేందుకు, ప్రజలకు మంచి చేయడానికి కావాల్సిన సూచనలను ఇవ్వదలచిన వారు నెంబర్ 9408639999 వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలియజేయగలరని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మా సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు రావిపాటి ప్రసాద్,ప్రధాన కార్యదర్శి మాగంటి నరేష్,ఐటీడీపీ రూరల్ మండల అధ్యక్షులు ముప్పాళ్ల శివనాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి జాన్ బాబు, రాజుపాలెం మండల పార్టీ అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు మండల బీసీ సెల్ అధ్యక్షుడు తుమ్మల ఏడుకొండలు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

17న ఉమ్మడి మహాసభకు తరలిరావాలి: టిడిపి

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయం ఆఫీస్‌లో శుక్రవారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా నరసరావుపేట టిడిపి ఇన్చార్జ్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ ఈనెల 17న బొప్పూడి దగ్గర జరిగే తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ ఉమ్మడి మహాసభకు ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట నుంచి దాదాపుగా 40 వేల మందికి పైగా టిడిపి జనసేన,బిజెపి కార్యకర్తలు బొప్పూడి సభకు వెళ్లే అవకాశం ఉందని దానికి తగ్గట్టుగానే బస్సులు కార్లు బైకులు తదితర వాహనాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	1,15,599
మిర్చి ఎగుమతి	:	1,32,064
మిర్చి నిల్వ	:	77,285

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,500 - 19,500
నెం.5	12,000 - 17,000
273	10,000 - 15,000
341	9,000 - 19,500
4884	12,000 - 15,000
సూపర్ 10	13,500 - 13,500
	నాన్ ఎసి
తేజ	8,000 - 21,000
బడిగి	10,000 - 19,000
దేవనూరు డీలక్స్	10,000 - 19,000
తాలుకాయలు	5,000 - 12,500

In the court of the Hon'ble II Addl.Senior Civil Judge: Guntur
I A.No.630/2023 in O.S .No: 472/2014

Between:
Meriga Raju ...Petitioner /Plaintiff
And
1)Meriga Christopher(Died),
2)Pondugala Akkamma & Others
....Respondents/Defendants

To.
R-8/Praposed D-8: Korrapati Chandra Sekhara Rao, S/o.Late Hanumantha Rao, R/o.Door No.26-46-16,1st lane NGO Colony, Opp . Govt Ayurvedic Hospital, Guntur -522004

పై నెంబరు దావాలోని ఐ.ఎ.నెం:630/2023లో 8వ రెస్పాండెంట్/ప్రపోజ్డ్ 8వ ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది: 03-04-2024కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణ లు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది:03-04-2024

కె.శ్యామ్ ప్రసాద్,
పిటీషనరు/ వాది తరపు అడ్వకేట్,
అరండల్ పేట, గుంటూరు,
సెల్: 93984 55618

Suit Summons
IN THE COURT OF THE HON'BLE IV ADDL.SENIOR CIVIL JUDGE::GUNTUR
O.S.No:103/2021

Between:
Achanta Padmavathi ..... Plaintiff
AND
Pothuguntla Samba Siva Rao ...Defendant

To,
Pothuguntla Samba Siva Rao, S/o. Chinna Amarya, R/o.Door No.134-1-160, Dwaraka Nagar 4 th lane, Nagaralu, Gorantla, Guntur (town & Dist)

పై తెలిపిన కోర్టులోని దావా లో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 01-04-2024న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:01-04-2024

ఇట్లు
యన్నం సుధీర్ బాబు,
వాది తరపు న్యాయవాది,
గుంటూరు. సెల్: 80086 29444

కోపల్లె గ్రామపంచాయితీ
టెండరు నోటీసు

ROC.No:- /2024 తేది:- 16-03-2024

గుంటూరు జిల్లా,తెనాలి మండలం , కోపల్లె గ్రామపంచాయితీ కార్యాలయం కోపల్లె లో ఈ క్రింద తెలుపబడిన పనులను ది:- 01-04-2024 నుండి 31-03-2025 వరకు చేయుటకు సీల్డు టెండర్లు పిలువబడుచున్నవి. సదరు టెండర్లు ది:- 26-03-2024 మధ్యాహ్నం గం.2:00 ల వరకు ఈ క్రింది సంతకందారునిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని స్వికరించబడును. స్వికరించబడిన టెండర్లు అదే రోజు సాయంత్రం గం:3:00 లకు హాజరైన టెండరు దారుల సమక్షంలో తెరువబడును. సకాలంలో రాని టెండర్లు దరఖాస్తు లేని టెండర్లు స్వికరించబడవు. ఇతర వివరములు ఈ కార్యాలయం పని వేళలయందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	2024-25 సంవత్సరమునకు చేయవలసిన పనులు	ధరావత్
1.	2024-25 సంవత్సరమునకు ఈ గ్రామ పంచాయితీకి అవసరమైన PH సామానులు సప్లయి చేయుట (నాణ్యమైన క్వాలిటీ)	200=00
2.	2024-25 సంవత్సరమునకు ఈ గ్రామపంచాయితీకి అవసరమైన చేతి పంపు సామానులు సప్లయి చేయుట (నాణ్యమైన క్వాలిటీ)	200=00
3.	2024-25 సంవత్సరమునకు గ్రామ పంచాయితీకి అవసరమైన స్టేషనరీ సామానులు సప్లయి చేయుట (నాణ్యమైన క్వాలిటీ).	100=00
4.	టెండరు పద్ధతిపై ఈ గ్రామపంచాయితీలో ది:01-04-2024 నుండి 31-03-2025 వరకు స్వీపరుగా పనిచేయుట.	100=00
5.	టెండరు పద్ధతిపై ఈ గ్రామపంచాయితీలో ది:01-04-2024 నుండి 31-03-2025 వరకు D.E.O గా పనిచేయుట.	100=00

సం॥ శ్రీ.జి. యస్.సి బోసు
పంచాయితీ కార్యదర్శి,
కోపల్లె

గుడివాడ గ్రామపంచాయితీ
టెండరు నోటీసు

ROC.No:- /2024 తేది:- 16-03-2024

గుంటూరు జిల్లా, తెనాలి మండలం , గుడివాడ గ్రామపంచాయితీ కార్యాలయం గుడివాడలో ఈ క్రింద తెలుపబడిన పనులను ది:- 01-04-2024 నుండి 31-03-2025 వరకు చేయుటకు సీల్డు టెండర్లు పిలువబడుచున్నవి. సదరు టెండర్లు ది:- 26-03-2024 మధ్యాహ్నం గం.2:00 ల వరకు ఈ క్రింది సంతకందారునిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని స్వికరించబడును. స్వికరించబడిన టెండర్లు అదే రోజు సాయంత్రం గం:3:00 లకు హాజరైన టెండరు దారుల సమక్షంలో తెరువబడును. సకాలంలో రాని టెండర్లు దరఖాస్తు లేని టెండర్లు స్వికరించబడవు.ఇతర వివరములు ఈ కార్యాలయం పని వేళలయందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	2024-25 సంవత్సరమునకు చేయవలసిన పనులు	ధరావత్
1.	2024-25 సంవత్సరమునకు ఈ గ్రామ పంచాయితీకి అవసరమైన PH సామానులు సప్లయి చేయుట (నాణ్యమైన క్వాలిటీ)	200=00
2.	2024-25 సంవత్సరమునకు ఈ గ్రామపంచాయితీకి అవసరమైన చేతి పంపు సామానులు సప్లయి చేయుట (నాణ్యమైన క్వాలిటీ)	200=00
3.	2024-25 సంవత్సరమునకు గ్రామ పంచాయితీకి అవసరమైన స్టేషనరీ సామానులు సప్లయి చేయుట (నాణ్యమైన క్వాలిటీ).	100=00
4.	టెండరు పద్ధతిపై ఈ గ్రామపంచాయితీలో ది:01-04-2024 నుండి 31-03-2025 వరకు స్వీపరుగా పనిచేయుట	100=00
5.	టెండరు పద్ధతిపై ఈ గ్రామపంచాయితీలో ది:01-04-2024 నుండి 31-03-2025 వరకు శానిటేషన్ ఆటో డ్రైవరు గా పనిచేయుట.	100=00
6.	టెండరు పద్ధతిపై ఈ గ్రామపంచాయితీలో ది:01-04-2024 నుండి 31-03-2025 వరకు D.E.O గా పనిచేయుట.	100=00

సం॥ శ్రీ.జి.యస్.సి బోసు,
పంచాయితీ కార్యదర్శి,
గుడివాడ

అడ్డగోలుగా చేపట్టిన అక్రమ బదిలీలను తక్షణమే రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సిఫార్సు బదిలీలు, లక్షలాది రూపాయిల చేతులు మారడం ద్వారా ప్రభుత్వం చేపట్టిన అడ్డగోలు బదిలీలు వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. గతేడాది మే, జూన్ నెలల్లో ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు నిర్వహించినా ఏడాది లోపే కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ విద్యార్థులకు పరీక్షల సమయంలో పెద్ద ఎత్తున అక్రమంగా బదిలీలు సరికాదని పేర్కొన్నారు. పల్నాడు ప్రాంతంలోని పాఠశాలలో పని చేస్తున్న అనేక మంది ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు బదిలీలకు సిఫార్సు చేయడంతో పల్నాడు ప్రాంత విద్యారంగం మరోసారి ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. కాసులున్న వారికి, మంత్రులు ఎమ్మెల్యేల అండదండలున్న వారికి అక్రమ బదిలీలు చేస్తుంటే సాధారణ ఉపాధ్యాయుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రస్తుతం 10వ తరగతి పరీక్షల సమయంలో బదిలీలు చేయటం విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో తెలిసిందని విమర్శించారు. ఈ చర్యలను మానుకోకుంటే ఉపాధ్యాయులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

గ్రామాలు, తండాల్లో దుర్గంధం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పచ్చదనానినికి, ఆహ్లాదానికి మారుపేరుగా పిలవబడే గ్రామీణ ప్రాంతాలను నిధుల లేమి కమ్ముకుని అపారిశుధ్యం, దుర్గంధంతో దర్శనమిస్తున్నాయి. దోమలకు నిలయాలై ప్రజల్ని రోగాల పాల్జేస్తున్నాయి. రొంపిచర్ల మండలంలో మారుమూల గ్రామలైన చాకలికుంట, కొత్తపల్లి, నకరికల్లు మండలం చేజర్ల, జిల్లాతండా, జిల్లాపేట తండా తదితర మారుమూల గ్రామాలు, తండాల్లో పారిశుధ్య పనులు సరిగా చేయడం లేదు. సైడు కాల్వల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కాల్వల్లో చాలాకాలంగా పూడికలు తొలగించకపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలు బారిన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దుస్థితిపై పంచాయతీ అధికారులను ప్రశ్నిస్తే నిధుల్లేవనే సమాధానం వస్తోందంటున్నారు. స్వచ్ఛ గ్రామాలు అని ఒకవైపు ప్రచారం చేసుకుంటూ మరోవైపు తమను దుర్గంధంలో బతికేలా చేస్తున్నారని అసహనాకి గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం పారిశుధ్య పనులైనా చేయించాలని కోరుతున్నారు.

రొంపిచర్ల మండలం చాకలికుంట గ్రామంలో మురుగు కాల్వలో నిల్వ ఉన్న మురుగునీరు, పేరుకుపోయిన వ్యర్థాలు

పల్నాడు జిల్లా ప్రభుత్వాస్పత్రికి రూ.30 లక్షలతో ఇఎన్‌టి పరికరాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశకర్, ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి తదితరులు

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం సమీపంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రూ.30 లక్షలతో సమకూర్చిన చెవి, ముక్కు, గొంతు (ఇఎన్‌టి) వ్యాధుల నిర్ధారణ పరికరాలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సౌజన్యంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సిఎస్ఆర్) కింద రూ.9 లక్షలతో ఇఎన్‌టి మైక్రో స్కోప్ , రూ.18 లక్షలతో చెస్ నియో నాటల్ వెంటిలేటర్, రూ.3 లక్షలతో ఇసిటి మిషన్ అందించినట్లు చెప్పారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గతంలో రూ. 3 కోట్లతో కలెక్టరేట్ వద్ద పెట్రోల్ బంకు ఏర్పాటు చేయగా అది విజయవంతంగా పని చేస్తోందని అన్నారు. సిఎస్ఆర్ కింద సుమారు రూ.60 లక్షలతో పిల్లలకు క్రీడా పరికరాలను అందించగా వాటిని 120 అంగన్‌వాడి కేంద్రాలకు అందించామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి అందుబాటులోకి వచ్చిన పరికరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. ఈ సందర్భంగా 2022లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కోటేశ్వరరావు, అన్నవరం కోటేశ్వరరావు, కానాల శివయ్య, కురిచేటి వెంకటేశ్వర్లు కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కింద మంజూరైన ఒక్కొక్కరికి రూ.లక్షను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ రంగారావు, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మంత్రు నాయక్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సిజిఎం డి.పి.సేతుపతి, జిఎంలు జి.వి. సత్యనారాయణ, రాజేష్ కుమార్, సీనియర్ మేనేజర్ అనిల్ కుమార్, మేనేజర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

జెండాను ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

ఓటింగ్ శాతం 88కు పెరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఓటింగ్ శాతం గతంలో 86 శాతం ఉండేదని దానిని మరో రెండు శాతం పెంచి 88 శాతం చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. శుక్రవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఓటు హక్కు ఆవశ్యకత గురించి వివరిస్తూ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేటలోని కాలేజి క్యాంపస్ నుండి చిలకలూరిపేట రోడ్డులోని క్యాంపస్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంబించిన కలెక్టర్ మాట్లాడుతూ యువత, ప్రజలు, ఓటర్లు ప్రలోభాలకు గురవ్వకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత ఓటు హక్కు ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమములో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, రెవెన్యూ డివిజినల్ అధికారి సరోజ, స్వీప్ సమన్వయకర్త నాగిని, డిఆర్‌డిఎ పీడీ బాలూనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న షేక్ జమీర్

జాతీయ స్థాయికి యడ్లపాడు జెడ్‌పి విద్యార్థి సైన్స్ నమూనా

ప్రజాశక్తి - యడ్లపాడు

చిత్తూరు జిల్లా పలమనేరులో ఈనెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మానక్ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో మండల కేంద్రమైన యడ్లపాడు జెడ్‌పి పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపినట్లు హెచ్‌ఎం జి.విజయభారతి శుక్రవారం తెలిపారు. తమ విద్యార్థి షేక్ జమీర్ రూపొందించిన 'మ్యాన్ హోల్‌ను శుభ్రం చేసే ఆధునిక యంత్రం' నమూనా జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు జమీర్ వెళ్లనున్నట్లు తెలిపారు. విద్యార్థి తోపాటు గైడ్‌గా వ్యవహరిస్తున్న సైన్స్ టీచర్ జి.రాధను హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

పిడుగురాళ్ల బైపాస్ ప్రారంభం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : పట్టణ వాసుల దశాబ్దం నాటి కల సాకరమైందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. అద్దంకి - నార్కెట్పల్లి రహదారిపై పిడుగురాళ్ల బైపాస్‌ను వుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి, మంత్రి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అద్దంకి నార్కెట్పల్లి పల్నాడు అభివృద్ధి కోసం ఏర్పాటు చేశారని, కొన్ని కారణాలవల్ల పిడుగురాళ్ల బైపాస్ నిలిచిందని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక దాన్ని పూర్తి చేశామని చెప్పారు. బైపాస్ పూర్తితో పిడుగురాళ్ల పట్టణానికి ట్రాఫిక్ సమస్య ఉండదని చెప్పారు. బైపాస్ ప్రారంభం సందర్భంగా కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే బైక్ ర్యాలీని నిర్వహించారు.

మేల్కొంటే కంపెనీలకు భారీ మూల్యమే

వినియోగదారుల అవగాహన సదస్సులో పల్నాడు జెసి శ్యాంప్రసాద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సదస్సులో మాట్లాడుతున్న పల్నాడు జెసి శ్యాంప్రసాద్

వినియోగదారుల చట్టాలపై ప్రజల్లో అవగాహన పెరగాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా 'బాధ్యతాయుతమైన కృత్రిమ మేథస్సు' అంశంపై పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. జెసి మాట్లాడుతూ గతంలో వినియోగదారులు కొనుగోలు సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆహారభద్రత, ఔషధ తనిఖీ, తూనికల కొలతల అధికారులతో వినియోగదారుల హక్కులను కాపాడుకునే సందర్భంలో తీసుకొనే చర్యలను వివరించారు. వినియోగదారులు తమ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో సాధ్యమైనంత వరకు పంచుకోవద్దని, తద్వారా సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని చెప్పారు. వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యత పరిశీలించాకే కొనాలన్నారు. ఆన్లైన్ మార్కెటింగ్ గురించి అవగాహన పెంచుకొని తద్వారా వస్తు సేవలను పొందాలన్నారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రచురిస్తున్న మేలుకొలుపు మాసపత్రిక గురించి ప్రస్తావించారు. వినియోగదారులకు ఉపయోగపడే విలువైన సమాచారం అందులో ఉంటుందన్నారు. గతంలో ఒకరినొకరు గౌరవించుకునే పరిస్థితి నుంచి ఒకరినొకరు మోసం చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అప్రమత్తంగా లేకుంటే మార్కెట్లో మోసపోతారని, వినియోగదారుడు తిరగబడితే సదరు కంపనీలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వివరించారు. వినియోగదారులు ఒక వస్తువును కొనుగోలు చేసేటప్పుడు గానీ, ఒక సర్వీసును తీసుకునేందుకు ఒప్పుకున్నప్పుడుగానీ దానికి సంబంధించిన షరతులను ముందే తెలుసుకోవాలని, కొనుగోలుకు సంబంధించిన పత్రాలను పదిలంగా ఉంచుకోవాలని సూచించారు. వేగంగా పెరుగున్న మార్కెట్ పోటీలో నిలదొక్కుకునేందుకు వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. న్యాయమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సుపై మాస్టర్ ట్రైనర్ బి.యం. సుభాని, మాస్టర్ బి.వి.ఏ.యల్ వరప్రసాద్ వివరించారు. కన్స్యూమర్ వాలంటీర్ ఆర్గనైజేషన్ సభ్యులు పి.యజ్ఞనారాయణ, సిహెచ్.వెంకట కోటేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ వరలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి నారాయణ, అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజి అల్లూరయ్య, చంద్రకాంత్ పాల్గొన్నారు.

నేడు సిపిఎం జిల్లా విస్తృత సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

సిపిఎం గుంటూరు జిల్లా విస్తృత సమావేశం 16వ తేదీ ఉదయం 10 గంటలకు మంగళగిరి సిపిఎం కార్యాలయంలో జరుగుతుందని సిపిఎం మంగళగిరి పట్టణ కమిటీ కార్యదర్శి వై కమలాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి పాశం రామారావు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిణామాలు, ఎన్నికలపై సిపిఎం పార్టీ వైఖరిని వివరిస్తారని తెలిపారు. కావున ఆహ్వానితులు సకాలంలో హాజరు కావలసిందిగా కోరారు.

స్వర్ణకారుల దీక్షలకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-మంగళగిరి

స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని సిపిఎం సీనియర్ నాయకులు జే వి రాఘవులు అన్నారు. స్వర్ణకారులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, తాళిబొట్లు తయారీ పని స్వర్ణకారులకే ఇవ్వాలని, 50 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వాలని, స్వర్ణకారులపై పోలీసుల వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని షరాఫ్ బజార్లో రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయి. శుక్రవారం నాటికి ఐదో రోజు చేరాయి. దీక్షా శిబిరాన్ని సిపిఎం నాయకులు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వర్ణకార వృత్తిపై రాష్ట్రవ్యాప్తంగా ఒక అధ్యయనం చేసి వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అయితే ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. చేనేత తర్వాత మంగళగిరి పట్టణంలో స్వర్ణకార వృత్తి బాగా పెరిగిందని అన్నారు. వైఎస్ఆర్సిపి పార్టీ ఇచ్చిన హామీ మేరకు వెంటనే స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఏం పకీరయ్య, పిల్లల మర్రి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం నాయకులు ఎం బాలాజీ, ఎస్ కోటేశ్వరరావు, షేక్ జానీ భాష తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారులకు మద్దతు తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

ఆత్మకూరులో ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :అంతర్జాతీయ మహిళా దినోత్సవం మరియు ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు మహిళా సంఘం ఆధ్వర్యంలో నిమ్మగడ్డ రామ్మోహన రావు నగర్ లోఐద్వా జెండాను జిల్లా కార్యదర్శి అరుణ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో అరుణ మాట్లాడుతూ నేడు జాతీయ మీడియా మోడీ భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ ప్రచారం చేస్తుందనీ, కానీ అంతర్జాతీయ మీడియా భారతదేశంలో మహిళలకు రక్షణ లేదని కోడైకూస్తుందనీ చెప్పారు. దానికి ఉదాహరణ విదేశీయురాలు మన భారతదేశానికి వస్తే ఆమెను బలాత్కారం చేసిన పరిస్థితి ఉందన్నారు.అమెరికా లోని ఒక సంస్థ రూపొందించిన విశ్లేషణలో మహిళలకు రక్షణ, శాంతి భద్రత సూచీలో 177దేశాలలో 128వ స్థానంలో ఉన్నామని తేల్చాయనీ వివరించారు. మోడీ గొప్పదనం గురించి చెప్పుకొనేందుకు ఆయన భక్తులు వల్లించే బేటీ పఢావో, బేటీ బచావో నినాదం భేటీ రక్షించబడటం లేదని అన్నారు.1995నుండి మహిళా సంఘాలు, కమ్యూనిస్టుల పోరాట ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లు నేడు ఆమోదించిన అమలు చేయడానికి అనేక అడ్డంకులు సృష్టిస్తున్న బిజెపిని ఎన్నికల్లో ఓడించ కపోతే మహిళలకు ఇప్పుడు ఉన్న హక్కులను కూడా హరిస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు సింహాద్రి సుమ, గ్రామ మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు కోడూరు సుజాత, మునగాల సంధ్యా, గౌరబత్తుల లక్ష్మి, కొండేటి ఏసు మణి, కటివరపు లక్ష్మి, చీపూరి శివనాగదుర్గ, బేతు శిరీష, తమ్మిశెట్టి లక్ష్మి, సిఐటియు నాయకులు ఉద్దంటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుం దని, వందేళ్ల క్రితమే గురజాడ చెప్పిన ఆలోచనలకు ప్రతిబిం బంగా నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తు న్నారని, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం విజయవాడ బాధ్యులు కాట్రగడ్డ స్వరూపరాణి అన్నారు. మహిళా నైపుణ్య శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న రెండో బ్యాచ్‌కు శు క్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కుట్టు శిక్షణా కేంద్రం ఆర్గనైజర్ గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. స్వరూపరాణి మాట్లాడుతూ పురుషాధిక్య సమాజంలో మహిళలు నేటికీ కొన్ని అవాంతరాలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహిళలు సమాజంలో ఎదగడాన్ని తరతరాల నుంచి వస్తున్న వ్యవస్థ జీర్ణించుకోలేక పోతుందని వెల్లడించారు. ఆడపిల్లలపై నేటికీ వివక్ష కొనసాగుతుందన్నారు. ఈ పద్ధతిని మార్చడానికి రాజరామ్మోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు తదితర మహనీయులు సంఘసంస్కర్తలు కృషి చేశారని కొనియాడారు. జ్యోతిరావుపూలే వందేళ్ల క్రితమే తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు చెప్పడంతో పాటు రాత్రి పాఠశాలలు పెట్టి అనేక మంది మహిళలను విద్యావంతులను చేశారని చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామని చెప్పుకుంటున్న పాలకులు నేటికీ మహిళలు 69 శాతం మాత్రమే చదువుకో గలుగుతున్నారని చెప్పారు. పురుషుల సంఖ్య వచ్చే సరికి 82 శాతంగా ఉందని చెప్పారు. ఎంబివికె బాధ్యులు పి.విజయ మాట్లాడుతూ కుట్టు శిక్షణ ద్వారా మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడి స్వయం ఉపాధి సాధించుకోవడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. స్వయంకృషితో ఎదగాలని కోరారు. నేడున్న పోటీ ప్రపంచంలో మహిళల డ్రెస్సులు అనేక ఫ్యాషన్ల రూపంలో వస్తున్నాయని వాటిని కూడా నేర్చుకుని ముందుకు సాగాలని కోరారు. చేతిలో విజ్ఞానం, విద్య ఉంటే ఎవరూ దొంగిలించలేరన్నారు. టైలరింగ్‌తో పాటు ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ తదితర వాటిలల్లో ఎంబివికెలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తాడేపల్లిలో ఈ కోర్సులు ప్రవేశపెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుట్టుమిషన్ ఉపాధ్యాయురాలు సిహెచ్.సుజాత, నిర్వాహకులు వెంకటరత్నం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కె స్వరూపరాణి

సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

ఎన్నికల సంసిద్ధతపై సమావేశం

ప్రజాశక్తి-మంగళగిరి : మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఎలక్షన్ సెక్టార్ల అధికారులతో శుక్రవారం సాయంత్రం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలోని హాల్లో ఎన్నికల సంసిద్ధతపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె రాజకుమారి పాల్గొని మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయవలసిన సదుపాయాలపై సూచనలు చేశారు. శాంతి భద్రతలు కాపాడేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమాల్ని కచ్చితంగా అమలు చేయవలసిన అవసరం ఉందని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ కె స్వాతి, సెక్టార్ అధికారులు కే వెంకటేశ్వరావు, కే ప్రకాష్ రావు, ఎం శ్రీనివాసరావు, ఎలక్షన్ కోడ్ అధికారి జే క్రాంతి కిరణ్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

5వ రోజుకు పంచాయతీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - ఫిరంగిపురం రూరల్

ఫిరంగిపురం లో గ్రామపంచాయతీ వర్కర్స్‌కు రావలసిన తొమ్మిది నెలల వేతన బకాయిలను వెంటనే ఇవ్వాలని, హరిత రాయబారులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని, కోరుతూ ఐదవ రోజు సమ్మె సందర్భంగా గ్రామంలోని తూర్పు బజార్, బీసీ హాస్టల్, ముస్లిం పాలెం కొండమెట్ల వీధులలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ సమ్మె శిబిరంలో పంచాయతీ కార్మికులు కళ్ళు మూసుకొని నిరసన తెలియ జేశారు. ఐదో రోజు జరిగిన సమ్మెకు గ్రామ పెద్దలు పి. హృదయ రాజు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు షేక్ మీరవలి, వెంకటేశ్వర్లు, ప్రభుదాస్, పుల్లయ్య, ఏసమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

వేజెండ్లలో 'మహిళలు - హక్కులు' సదస్సు

ప్రజాశక్తి - చేబ్రోలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేజెండ్ల అంబేడ్కర్ నగర్ కొలకలూరి ఇనాక్ కమ్యూనిటీ హాల్లో సిఐటియు ఆధ్వర్యంలో "మహిళలు–హక్కులు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది వేడుకగా ఉండకూడదని, మహిళలను తమ సమస్యల పరిష్కారానికి భాగస్వాములు చేసే వేదికగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళా హక్కులను మానవ హక్కులుగా గుర్తించినప్పటికీ అమలు గాని పరిస్థితి బాధాకరమని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆచారాలు సాంప్రదాయాలు పేరుతో మహిళ పట్ల వివక్షత సరికాదని అన్నారు. మహిళలపై వేధింపులు, దాడులు అత్యాచారాలు లేని సమ సమాజ నిర్మాణం కోసం మహిళలందరూ ఐక్యమై పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది నాడు మహిళల పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని గంటలు తగ్గించాలని కోరుతూ జరిగిన కార్మిక వర్గ పోరాటాల నుండి ప్రారంభమైందని అన్నారు. నేటికీ అవే సమస్యల మీద మాట్లాడుకోవాల్సి రావడం అంటే మహిళల హక్కుల పట్ల ఈ ప్రభుత్వాలకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందని అన్నారు. కార్యకమనికి అంగన్వాడీ యూనియన్ మండల కార్యదర్శి రత్న మంజుల అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సుమలత, దాయమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించడం జరిగింది.

కెఎల్‌యులో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ విశ్వవిద్యాల యంలో మహిళా మహోత్స వాలు కెఎల్ ఉమెన్ డెవల ప్మెంట్ సెల్ అద్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమ య్యాయి. ముఖ్యఅతిథిగా టిసిఎస్ మాజీ ఉపాధ్యక్షురాలు హేమ గోపాల్ హాజరయ్యి, మహిళలను ఉద్దేశించి ప్రసం గించారు. సమాజంలో మహి ళలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యల గురించి వివరించారు. పురుషులతో సమానంగా మహిళలు పారిశ్రామిక రంగంలో కూడా రాణిస్తున్నారని అన్నారు. పలువురు మహిళలు, వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయవాడ కమర్షియల్ సేల్ ట్యాక్స్ అధికారిణి లలిత కుమారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది మహిళల సామాజిక, ఆర్థిక,సాంస్కృతిక రాజకీయ విజయాలను గుర్తు చేసేది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించిందన్నారు. ఫెమ్ ఫ్లేర్ చైర్ పర్సన్ డాక్టర్ రూత్ రమ్య మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరగాలన్నారు. మొదటి రోజయిన శుక్ర వారం నాడు వేడుకలలో బాగంగా పలు రకాల టెక్నికల్,నాన్ టెక్నికల్ కార్యక్రమాలను నిర్వహించారు. వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ మాట్లాడుతూ కెఎల్ విశ్వవిద్యాలయంలో నలబై ఐదు శాతం విద్యార్థినులు, 40శాతం మహిళా ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. మహిళల ఆవిష్కరణలకు, వారి ఆలోచనలకు కెఎల్ వేదిక కావడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కార్యదర్శి కోనేరు శివకాంచనలత, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదదీష్, డాక్టర్ చప్పిడి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ పవని ప్రియాంక

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-తెనాలి

మహిళల్లో ప్రమాధకరంగా వ్యాపించే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చునని హ్యాపి హాస్పిటల్ అధినేత డాక్టర్ వి.పవని ప్రియాంక అన్నారు. హ్యాపిహాస్పిటల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశాల్లో 'సర్వైకల్ క్యాన్సర్'పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో గర్భాశయ ముఖద్వార కాన్సర్‌పై అవగాహన కల్పించి, రూ.3వేల విలువైన నిర్ధారణ పరీక్షను ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పవని ప్రియాంక మాట్లాడుతూ 100 మందిలో 26 మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించినట్లు చెప్పారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలని, వివాహిత మహిళలు ఖచ్చితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం వైద్యశాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులో డాక్టర్ కె.హరిణి, రెడ్‌క్రాస్ కార్యదర్శి ఎం.భానుమతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేకపోతున్నాం

- పెండింగ్ జీతాలు, బిల్లులు చెల్లించండి
- ప్రభుత్వ హామీలేమయ్యాయి?: అంగన్వాడీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అంగన్వాడీలు తమ సమస్యల పరి ష్కారం కోరుతూ గత ఏడాది డిసెంబర్ 12 నుంచి ఈ ఏడాది జనవరి 23 వరకు 42 రోజుల పాటు దీక్షలు చేసిన విషయం తెలిసిందే. తమ సమస్యలను పరిష్కరిస్తా మన్న ప్రభుత్వ హామీతో వారు తిరిగి తమ విధుల్లో చేరి కూడా యాభై రోజులు దాటుతోంది. అయినప్పటికీ ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యలను సాగి స్తోం దని మండలంలోని అంగన్వాడీలు, వర్కర్లు, హెల్పర్లు వాపోతున్నారు. ప్రభు త్వం అంగీకరించినట్లుగా సమ్మె కాలానికి జీతాలు, ఆ తర్వాత డిసెం బర్, జనవరి, ఫిబ్రవరి నెలల జీతాలు, కూరగాయలు, గ్యాస్ బిల్లులు, అంగన్వాడీ కేంద్రాలకు అద్దెలు, కరెంట్ బిల్లులతో పాటు సమ్మె కాలానికి ముందు నుంచే ఆగిపోయిన ఇత ర ఖర్చులు, కమ్యూనిటీ బేసిడ్ మోటి వేషన్ ఈవెంట్ ఖర్చులు ఇవ్వ కుండా నెలల తరబడి ఆగిపోయాయని, మరి కొన్ని బిల్లులైతే సంవత్సరాల తరబడి ఆగిపోయాయి. నియోజక వర్గంలో మొత్తం అంగన్వాడి కేంద్రాల సంఖ్య 267. వాటిలో చిలకలూరిపేట రూరల్ 77, పట్టణ పరిధిలో 43, నాదెండ్ల మండ లంలో 86, యడ్ల పాడు మండల పరిధిలో 61 కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్వాడీల సంఖ్య సుమారు 784. వీరికి జీతాలు ప్రతినెలా 4వ తేదీ నుంచి 10 లోపు పడుతుంటాయి. అయితే, తమకు జీతాలు పెంచుతామన్న ప్రభుత్వ హామీతో తాము తిరిగి ఉద్యోగాల్లో చేరామని, సమ్మె కాలంలో అంగన్వాడీల, ఆయాల, టీచర్ల కుటుంబాలు గడవని పరిస్థితి కారణంగా అప్పులు చేశామని కొందరు, అప్పు దొరకని వారు కూలి పనులకు వెళ్లి మరి కుటుంబాలను నెట్టుకొచ్చామని మరి కొం దరు చెబుతున్నారు.

డిసెంబర్‌కు సంబంధించిన పూర్తి కాలానికి జీతం ఇవ్వకుండా కేవలం 8 రోజులకే ఇచ్చారని చెబుతున్నారు. డిసెం బర్‌లో మిగిలిన 22 రోజులకు, జనవరి, ఫిబ్రవరికి సంబంధించిన పూర్తి జీతాలు రాలేదంటున్నారు. వీటితో పాటు అంగ న్వాడీ కేంద్రాల నాలుగైదు నెలల అద్దెలు, సం వత్సరాల తరబడి విద్యుత్ బిల్లులు, అంగన్వాడీ కేంద్రాల్లో ఒక్కొక్క పిల్ల వానికి కూరల కోసం, చిల్లర సరుకుల నిమిత్తం ఇచ్చే రూ.1.50, గ్యాస్ కు ఇచ్చే యాభై పైసలును (బియ్యం, కంది పప్పు,నూనె, కోడిగుడ్డు మాత్రమే ఇ స్తారు) సుమారు ఎనిమిది,తొమ్మిది నెలలుగా ఇవ్వలేదని చెబుతున్నారు. గర్భిణులకు ప్రతినెలకు రెండు సిబి(కమ్యూనిటీ బేస్డ్) ఈవెంట్లను నిర్వ హిస్తామని వాటి నిమిత్తం ఒ క్కొక్క ఈవెంట్‌కు రూ.250 ఇస్తారని, సుమారు రెండున్నరేళ్లుగా ఒకొక్క కేంద్రానికి ఇవ్వాల్సిన ఆ డబ్బులను కూడా ఇవ్వలేదని అంటున్నారు. అంతేకాకుండా కార్యాలయ రిపోర్టులకు సంబంధించిన పుస్తకాలు, కాగితాలు కూడా సొంత డబ్బులతోనే కొనుగోలు చేస్తున్నామని, ఆ డబ్బులు వస్తాయో రావో తెలియదని చెబు తున్నారు. ఇప్పటికే పూర్తి స్థాయిలో అప్పులలో మునిగిపోయామని, వడ్డీలు కట్ట లేక పోతున్నామని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం తమకు రావాల్సిన పెండింగ్ బకాయిల మొత్తాన్ని వెంటనే చె ల్లిం చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సమ్మె కాలానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీకి జిఒ ఇచ్చి, వాటిని వెంటనే అమలు చేయాలని కోరుతున్నారు. వెంట నే అమలు చేయాలంటున్నారు.

నూతన పాలక వర్గంతో రాజేష్‌నాయుడు తదితరులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా గొంటు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా గొంటు శ్రీనివాస్‌రెడ్డి, నూతన పాలకవర్గం శు క్రవారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక పాత వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యార్డు ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఇతర యార్డు డైరె క్టర్లతో యార్డు సెక్రటరీ యోగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి వైసిపి చిలకలూరిపేట నియోజకవర్గ వైసిపి నాయ కులు మల్లెల రాజేష్ నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గొంటు శ్రీనివాసరెడ్డి మాట్లా డుతూ తన నియమాకానికి కృషి చేసిన సిఎం జగన్‌కి, మల్లెల రాజేష్ నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కె.వీరారెడ్డి, కె.శ్రీనివాసరావు, పి.చిన్న బాబు, సిహెచ్.యఘ్నేశ్వ రరెడ్డి, ఎవిఎం సుభాని, పి.వెంగళ రాయుడు, ఎం.వి. రత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు, గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -బెల్లంకొండ

పోషణ్ పక్వాడ పక్షోత్స వాలు సందర్భంగా మం డలం కేంద్రంలోని సచి వాల యం పరిధిలోని అం గన్వాడి సెంటర్‌లో ఓ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్.శ్రీనివాస్ ఆయుష్ వైద్యాధికారి పాల్గొ న్నారు. బాలింతలకు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వ హించారు. రక్తహీన తకు, బలహీన తలకు ఆయుష్ మందు లను పంపిణీ చేశారు. పార్వతి, ఆయేషా ప్యారి, సునీత, ఎంఎల్‌హెచ్ పి మధులత, ఎఎన్ఎం కోటేశ్వరి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-రాజుపాలెం

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఐసిడిఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చైల్డ్ ప్రొటె క్షన్ అధికారి ప్రశాంతి హాజరయ్యారు. బాలల హక్కులు, వివా హ చట్టాలు, బంగారుతల్లి పథకంపై కిశోర బాలికలకు, తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి.మల్లిఖార్జున శర్మ, ఐ. సిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి టి.శ్రీలత, వెలుగు ఎపిఎం సునీత పాల్గొన్నారు.

ఉన్నత భవిష్యత్ కోసం ఇష్టపడి చదవండి

ప్రజాశక్తి-మాచర్ల

సమాజంలో ఉన్నత గుర్తింపు పొందేందుకు చదువు ఏకైక మార్గమని గురజాల ఎఎస్‌డబ్ల్యూఓ టివి సుజాత కుమారి అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టివి సుజాతకుమారి మాట్లాడుతూ తల్లిదండ్రుల నమ్మకాన్ని, వారి కష్టార్జితాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు వారి భవిష్యత్ కోసం ఇష్టపడి చదివితే మంచి మార్కులతో రాణించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పి.పౌలేష్, మాధవీలత, గోపాల్ నాయక్, అరుణకుమారి, శిరోమణి, సుమణి పాల్గొన్నారు.

రూ 14.37 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణి

ప్రజాశక్తి- మాచర్ల

అత్యవసరంలో సొంత ఖర్చుతో వైద్యం చేయిం చుకున్న, అర్హులైన పేదలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎం ఆర్‌ఎఫ్) ద్వారా తమ ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడి అన్నారు. మాచర్లలోని తన కార్యాలయంలో గురువారం 22 మంది లబ్ధి దారులకు రూ 14. 37 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్యం పరంగా పేదలు, నిరుపేదలు, మధ్య తరగతి ప్రజ లకు తమ ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తుందన్నారు.

ధూళిపాళ్లలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రక్తపరీక్ష చేయించుకుంటున్న లక్ష్మీ నారాయణ

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి మండలం దూళిపాళ్లలో శ్రావణి హాస్పిటల్స్ నిర్వ హించిన ఉచిత వైద్య శిబిరాన్ని లక్ష్మీ నారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లా డుతూ పేద ప్రజలకు సరైన సదుపాయం లేక వైద్య పరీక్షలు చేయించుకోలేకపోతున్నాంనే ఉద్దేశంతోటి. ఈసీజీ, గుండె, స్కానింగ్,ఎకో, పరీక్షలు షుగర్, బీపీ,జనరల్ వైద్య పరీక్షలన్నీ ఉచితంగా చేయిస్తు న్నట్లు చెప్పారు. తెలిపారు.

స్కౌట్ యూనిట్‌ను ప్రారంభించిన డిఇఒ

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక శంకర భారతిపురం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శుక్ర వారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొని భారత స్కౌట్, గైడ్స్ యూనిట్‌ను ప్రారం భించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ఎం. పార్వతి అధ్యక్షత వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్స్ ను ప్రారం భించాల్సిన అవశ్యకత ఉందని, శంకరభారతిపురం పాఠశాల అన్ని రంగాల్లో ముందుంటూ స్కౌట్ యూనిట్‌ను ప్రారంభించిన మమ్మీ వెంకటరెడ్డిని అభినందిం చారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి సేవాభావం క్రమశిక్షణ కలిగించడంలో స్కౌట్ యూనిట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో నరస రావుపేట లోకల్ అసోసియేషన్ సెక్రటరీ ఎం. కృష్ణయ్య, బివిఎల్. వరప్రసాద్ పాల్గొన్నారు

సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో గీతమ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-వినుకొండ : జనవరి 28 న పట్టణంలోని లయోలా హైస్కూల్లో జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీ క్షలలో గీతమ్స్ విద్యా ర్థులు అత్యధిక మార్కులతో అర్హత సాధించారని కరెస్పాండెంట్ మాల పాటి కోటిరెడ్డి తెలిపారు. ప్రతీక్ శివ సాయి 194, జస్వంత్ రెడ్డి 187 , చేతన్ 153, హర్షిత్ 143, అరవింద్ రెడ్డి 139 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినం దన సభలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శనివారం 16 మార్చి 2024

కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా మేనేజర్ రోషన్‌కు అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

రోషన్‌ను అభినందిస్తున్న శ్రీధర్‌బాబు

కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా మేనేజర్ షేక్.రోషన్ జాకీర్‌కు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్నారు. కామన్ సర్వీస్ సెంటర్ స్టేట్ హెడ్ రఘు అందజేశారు. ఏపీలో 13 జిల్లాల్లో గుంటూరుకు అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని షేక్ రోషన్ జాకీర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా కార్యాలయంలో షేక్ రోషన్‌కు శ్రీ సాయి టూర్ హబ్ ప్రోప్రైటర్ పల్లా శ్రీధర్‌బాబు తదితరులు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

సిమెంటు రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి :మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి గ్రామంలో సుమారు 40 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. గత ఎన్నో సంవత్సరాలుగా ఉండవల్లి జామాయిల్ తోట ప్రాంతంలో రోడ్లు లేక ఎంతో ఇబ్బంది పడుతున్న ప్రజల అభ్యర్థన మేరకు రోడ్లు నిర్మించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు కోరుతూ 73వ రోజు నిరసనలు

ప్రజాశక్తి - తెనాలి

ప్రభుత్వం దొడ్డి దారిన తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని కోరుతూ ఫెడరేషన్ పిలుపు మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు భవనాల వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 73వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు యన్నంశెట్టి శివరామకృష్ణ ప్రసాద్, షేక్ కాలేషా పాల్గొనగా వారికి భార్ అసోసియేషన్ అధ్యక్షులు మందలపు వేణుగోపాలరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు పరిధిలోని అంశాలను, ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులతో కూడిన ట్రిబ్యునల్ పరిధిలోకి వెళుతుందన్నారు. ట్రిబ్యునల్ నిర్ణయాన్ని హైకోర్టులో మినహా సవాలు

నిరసనలో న్యాయవాదులు

చేసే పరిస్థితి లేదని ఫలితంగా సామాన్యులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని కోరారు. నిరసనలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

బాల్యం నుండే ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ వినియోగదారుల రక్షణ దినోత్సవం సందర్భంగా ది గుంటూరు వినియోగదారుల సంఘం ఆధ్వర్యం లో స్థానిక పాతగుంటూరు, యల్‌బి నగర్, అప్పర్‌ప్రైమరీ స్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. కౌన్సిల్ కార్యదర్శి టి.వి.కృష్ణమూర్తి మాట్లాడుతూ బాల్యం నుండి చెడుపై ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారని అన్నారు. వస్తువులు, గృహోపకరణాల కొనుగోలుపై పూర్తి అవగాహన ఉంటే నష్టపోకుండా ఉంటారన్నారు. ఈ సందర్భంగా నాల్గవ తరగతి పాఠ్యాంశంలోని వినియోగదారుల అంశం పిల్లలతో చదివించి, పూర్తి అర్థాన్ని వివరించారు. అసత్య ప్రచారాలను, మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దని,

మాట్లాడుతున్న కృష్ణమూర్తి

నాణ్యతలేని వస్తువులపై ఆఫర్లను దూరంపెట్టి నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూలు హెచ్‌ఎం తిరుపతిరెడ్డి, కౌన్సిల్ సభ్యులు జి.శ్రీహరి తదితరులు ప్రసంగించారు.

విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ జాన్ బాబు

ప్రసూన చారిటబుల్ ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి రూరల్ గ్రామం కఠెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూచిపూడి ప్రసూన చారిటబుల్ ట్రస్ట్ తరపున 9,10 తరగతి విద్యార్థులకు పరీక్షాసామగ్రి అందజేశారు. అధ్యాపకులు బోధించిన పాఠ్యాంశాలను పాయింట్ల రూపంలో నోట్స్ రోపొందించుకోవలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి శ్రీధర్ మాట్లాడుతూ సేవాధృక్పదంతో ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. గ్రామ సర్పంచ్ బి ప్రసాద్, గుమ్మడి వెంకటనారాయణ, ఎంఇఒ-1, లక్ష్మీనారాయణ ఎంఇఒ-2 జయంతి బాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి రూరల్ గ్రామం కఠెవరంలో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించినట్లు తెనాలి రూరల్ ఎస్సై పి కోటేశ్వరరావు తెలిపారు. జిల్లా ఎస్పి ఆదేశానుసరం రూరల్ పరిధిలోని కఠెవరం, కోపల్లె గుడివాడ, గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించిన, ఎన్నికల అధికారులతో దురుసుగా ప్రవర్తించిన ఎన్నికల నియమావళి ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు, వరగాని విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న పెదనందిపాడు టౌన్ మినహా మిగిలిన అన్ని గ్రామాలకు మరమ్మతులు,ట్రీ కటింగ్ నిమిత్తం విద్యుత్ నిలిపివేయ బడుతుందని విద్యుత్ శాఖ ఎఇ వీరాంజనేయలు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నము 2 గంటల వరకు విద్యుత్ అంతరా యానికి వినియోగదారులందరూ సహకరించాలని వారు కోరారు.

మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్యులు.

వడ్డేశ్వరంలో ఆరోగ్య సంజీవిని వైద్యశిబిరం

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

ఎం టి ఎం సీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో ఆరోగ్య సంజీవిని మెడికల్ క్యాంపును, టిడిపి నాయకులు నిర్వహించారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ ఉచిత మెడికల్ క్యాంపులో గ్రామానికి చెందిన 110 మంది వివిధ రకాల వైద్య పరీక్షలను చేయించుకున్నారు. అనంతరం వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రహ్మణ్యం, అధికారి రాజేష్, షేక్ ఇమాంస, వడ్డేశ్వరం ప్రసాద్, గురువింద పల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ వేలం వాయిదా

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని పలు మార్కెట్లకు బహిరంగ వేలం పాటలు శుక్రవారం నిర్వహించారు. కమిషనర్ సిఎంఈ నయీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ కూరగాయల మార్కెట్ వేలంపాటలకు ఎవరు రాకపోవడంతో ఈనెల 19వ తేదీకి వాయిదా వేసినట్లు కమిషనర్ నయీమ్ అహ్మద్ ప్రకటించారు. మిగిలిన పలు మార్కెట్లకు వేలంపాట నిర్వహించారు. కాగా సంద్రి మార్కెట్ ను రూ. 6 లక్షల 95 వేలకు అసదుల్లా బేగ్ దక్కించుకున్నారు. మాంసం మార్కెట్ వేలంపాటను షేక్ గఫారి లక్ష ఇరవై రెండు వేలకు, చేపల మార్కెట్ పాట కూడా షేక్ గఫారి రూ.40 వేలకు పాడుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ తోట వెంకటేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదలతో పరీక్షలు రాసి లక్ష్యాన్ని సాధించాలి

న్యూరో సర్జన్ డాక్టర్ పి.వరుణ్

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పదోతరగతి విద్యార్థులు ఆందోళన చెందకుండా పట్టుదలతో పరీక్షలు రాసి లక్ష్యాన్ని సాధించాలని విజయవాడ న్యూరో సర్జన్ డాక్టర్ పి వరుణ్ తెలిపారు. శుక్రవారం పెదనందిపాడు లోని అశోకా పాఠశాలలో పది విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తాను కూడా ఈ పాఠశాల విద్యార్థినేనని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోపూరి లక్ష్మీనారాయణ, డైరెక్టర్ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో వంద బ్యాటరీ పంపులు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : టిడిపి నేత నారా లోకేష్ సహకారంతో, తాడేపల్లి మండల రూరల్ అధ్యక్షులు అమరా సుబ్బారావు, టిడిపి కుంచనపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం కుంచనపల్లిలో 100 మంది రైతులకు బ్యాటరీ పంపులు అందజేశారు.ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల రూరల్ అధ్యక్షులు అమరా సుబ్బారావుతో కలిసి మంగళగిరి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు రైతులకు బ్యాటరీ పంపులు అందజేశారు.

జనరల్ సెక్రెటరీగా దేవరకొండ గోపి

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ :పొన్నూరు పట్టణ ఎస్టీ నాయకులు దేవరకొండ గోపిను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టి సెల్ కమిటీలో జనరల్ సెక్రటరీగా పార్టీ అధిష్టానం నియమించిందని తెలిపారు. సందర్భంగా సహకారం అందించిన పార్టీ నాయకులు వై యస్ జగన్ మోహన్ రెడ్డికి, పొన్నూరు శాసన సభ్యులు కిలారి వెంకట రోశయ్యకి గోపి అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో ఎస్టీ సోదరుల తోడ్పాటుతో నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.

రైతులకు బ్యాంకులు సహకరించాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు : రైతులను ఇబ్బందులు పెట్టే విధానాన్ని బ్యాంకులు విడనాడాలని ఎపి రైతు సంఘం నాయకులు కొత్త వెంకట శివరావు సిపిఎం నాయకులు డి రమేష్ బాబు తెలిపారు. పెదనందిపాడు చైతన్య గోదావరి బ్యాంకులో గోల్డ్ లోను, క్రాప్ లోను తీసుకున్న గార్లపాడు కు చెందిన ఇంటూరి సాంబశివరావు అనే రైతును గోల్డ్ లోను మొత్తం చెల్లించిన, క్రాప్ లోను వడ్డీ రెన్యువల్ చేస్తేనే బంగారం చేతికి ఇస్తామని బ్యాంకు వారు చెబుతున్నారన్నారు. పొలం పాస్ పుస్తకాలు హామీకి పెట్టుకుని కూడా క్రాప్ లోను వడ్డీ కడితేనే బంగారం ఇస్తామనటం సరికాదన్నారు. బ్యాంకులు తమ పరిధి దాటి రైతుల్ని ఇబ్బందులు పెట్టడం తగదన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఎమ్మెల్సీకి పలువురు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు నివాస గృహం వద్ద శుక్రవారం ఎమ్మెల్సీ మురుగుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లికి చెందిన విజయవాడ దుర్గ గుడి ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులు జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(జేపీ) ఎమ్మెల్సీ మురుగుడును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

మంగళగిరిలో లావణ్య ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మురుగుడు లావణ్య శుక్రవారం మంగళగిరి పట్టణంలోని భార్గవపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం చేస్తున్న పథకాలను వివరిస్తూ ఓట్లు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురు గుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాంద్రు కమల, వైఎస్ఆర్‌సిపి నాయకులు మునగాల మల్లేశ్వరరవు, మల్లవరపు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ వైసిపిలో చేరడం సిగ్గుచేటు

ప్రజాశక్తి మంగళగిరి

వైసీపీకీ అమ్ముడుపోయాడంటూ ముద్రగడ పద్మనాభంపై యువ కాపు నాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవాడ దుర్గారావు మండిపడ్డారు. వ్యక్తిగత స్వార్థం కోసం ముద్రగడ వైసీపీలో చేరారన్నారు. వైసీపీలో చేరి ముద్రగడ తన స్థాయిని దిగజార్చుకున్నారని విమర్శించారు. కాపులకు రిజర్వేషన్ దక్కేంతవరకు పోరాటం చేస్తానని చెప్పిన ముద్రగడ పద్మనాభం జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే కాపుల సమస్యలను గాలికివదిలేసింది ఇందుకేనా అని ప్రశ్నించారు. బడ్జెట్‌లో నిధులు కేటాయింపులో కాపు కార్పొరేషన్ ను నిర్లక్ష్యం చేసినా నోరు మెదపలేదన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు కాపు కార్పొరేషన్ ద్వారా రూ.3100 కోట్లు నిధులు కాపులు సంక్షేమానికి ఖర్చుచేశారని గుర్తుచేశారు. కాపు నేస్తం పేరుతో మోసం చేశారన్నారు.

సిఎఎ పై వైసిపి, టిడిపి మాట్లాడాలి

మంగళగిరిలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడిందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ అన్నారు. గడపగడపకు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నానని తనకు ఓట్లు వేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జలీల్ నగర ప్రజలు ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు కుటుంబాల వారే ప్రభుత్వాన్ని పాలిస్తున్నారని వాస్తవానికి ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, కాపులు, మైనార్టీలు 80 శాతంగా ఓటర్లు ఉన్నారని మనకే రాజ్యాధికారం కావాలని జలీల్ పిలుపునిచ్చారు. అప్రజాస్వామికంగా ముస్లింలకు నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సిఏఏను, సిపిఐ, సిపిఎం నవరంగ్ కాంగ్రెస్ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. సిఏఏ పై వైఎస్ఆర్‌సిపి, టిడిపి పార్టీలు నోరు మెదపడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ సైదా, రిజ్వాన ,షేక్ మస్తాన్ ,భాషా, జానీ బేగం ,షమీమ్, రఫీ, షహీన, గుర్రం రామారావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతోనే వ్యాధులకు స్వస్తి

ప్రజాశక్తి - తెనాలి: దోమల నియంత్రణ తో డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్ ఉమాకాంత్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ముత్తంశెట్టి వారి పాలెం మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల పరిసర ప్రాంతాలలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంచారు. ఆయా ప్రాంతాలలో జనావాసాల మధ్య డబ్బాలు, సీసాలు, టైర్లు వంటి వాటిలో నిల్వ ఉన్న నీటిని తొలగింప చేశారు. పాఠశాల విద్యార్థులకు దోమల ద్వారా వ్యాపించే వ్యాదులను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎ బాలచంద్రమౌళి, డి శ్రీనివాసరావు, డి మల్లేశ్వరరావు, షేక్ నవీద్, షేక్ రషీద్ పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ జిఎంసి క్యాష్ కౌంటర్లు

ప్రజాశక్తి-గుంటూరు :రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు మరో 15రోజులు మాత్రమే ఉన్నందున పన్ను చెల్లింపుదారులకు వీలుగా సెలవు రోజుల్లోనూ క్యాష్ కౌంటర్లు యధావిధిగా పనిచేస్తాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి ఏక మొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించిందని, నగర పజలు ఈ నెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితి పొందాలని తెలిపారు. ఏప్రిల్ 1 నుండి పన్నుపై వడ్డీ యధావిధిగా ఉంటుందన్నారు. కావున గడువులోగా పన్నులు చెల్లించాలని కోరారు. జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డు 148వ వార్డు సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు యధావిదిగా పనిచేస్తాయన్నారు.

ఈవిఎంలు, వివి ప్యాట్‌ల పనితీరుపై శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు

సార్వత్రిక ఎన్నికల్లో ఈవిఎంలు, వివి ప్యాట్‌ల వినియోగంపై సెక్టోరల్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఈవిఎంలు, వివి ప్యాట్‌ల వినియోగంపై కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా సెక్టోరల్ అధికారులకు డెమో ఈవిఎంలు, వివి ప్యాట్ లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవిఎంలు, వివి ప్యాట్‌లు పని చేసే విధానంపై సెక్టోరల్ అధికారులు సమగ్ర అవగాహన కల్గి ఉండాలన్నారు. ఎన్నికల సయమంలో ఏ పోలింగ్ కేంద్రంలో సమస్య ఎదురైనా వెంటనే సెక్టోరల్ అధికారులు పరిష్కారం చేసేలా ఈవిఎంల పనితీరు తెలుసుకోవాలన్నారు. ఈవిఎం, వివి ప్యాట్ కనెక్షన్, సీల్ అత్యంత ప్రదానమైన అంశాలన్నారు. మాస్టర్ ట్రైనీలు ఈవిఎంలపై ఏ సందేహం ఎదురైనా పరిష్కారం చేయడానికి సిద్దంగా ఉంటారన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనీలు ఈవిఎంలు, వివి ప్యాట్‌ల పనితీరుపై వివరించి, సెక్టోరల్ అధికారులు అడిగిన సందేహాలను నివృతి చేశారు.

చలపతిలో ఘనంగా యువజనోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

మధును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో నోవమ్ -2024 యువజ నోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ సీనియర్ టెక్నికల్ మేనేజర్ మధు వడ్లమాని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవ టానికి విద్య ఒక్కటే సాధనం కాదని, ఆత్మవిశ్వాసం, చక్కని అవగాహన జీవితంపై పెంపొందించుకోవాలని, సమాజంలో విశిష్ట వ్యక్తులుగా రాణించవచ్చన్నారు. బి.టెక్ విద్యార్థులు తమ నాలుగు సంవత్సరాల విద్య కాలం ఎంతో విలువైనదని, ఆత్మ విశ్వాసం, ధైర్యంతో ఏ వృత్తి, వ్యాపారాలు చేపట్టినా విజయాన్ని తప్పక పొందవచ్చన్నారు. పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్ అడ్వైజర్ యాగంటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థి నిత్య జీవితంలో నిరంతరం నేర్చుకొని, కృషి చేసి జీవితంలో ముందుకు సాగిపోవాలన్నారు. చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు, నైపుణ్యాలు పెంపొందించుకొని పట్టుదలతో, స్వయం కృషితో పురోగమించాలన్నారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలో సరైన నిర్ణయాలు తీసుకోవాలని, మన భవిష్యత్‌ను మనమే తీర్చిదిద్దుకోవాలని, జీవితంలో ఏ సమస్యలు ఎదురైనా సులువుగా పరిష్కరించుకున్నప్పుడే మంచి ఇంజినీర్లుగా స్థిరపడవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్, నోవమ్ కన్వీనర్ డాక్టర్ ఏ.బాలాజీ మాట్లాడుతూ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, తదితర పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు.

కోల్డ్ స్టోరేజి బాధిత రైతుల్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు : దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాద ఘటనపై మార్కెటింగ్ శాఖ నివేదికను వెంటనే ఇచ్చి బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలని శుక్రవారం పసుపు రైతులు మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావును స్థానిక చుట్టుగుంటలోని మార్కెటింగ్ శాఖ కార్యాల యంలో కలిసి వినతి పత్రం అందజేశారు కోల్డ్ స్టోరేజీ ప్రమాదం జరిగి 60 రోజులు అవుతున్నా ఇంతవరకు నివేదిక ఇవ్వకపోవడం వలన బాధిత పసుపు రైతులు ఆందోళన చెందుతున్నారని, బాధిత రైతులు చెల్లించిన ఇన్సూరెన్స్ డబ్బులను జమ చేయకుండా కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం మోసం చేసిందని, రైతులను నట్టేట ముంచారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్‌లోనే పసుపును కాళీ చేస్తారనే ఉద్దేశంతో ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించలేదని యాజమాన్యం చెప్పటం చూస్తుంటే దీని వెనక పెద్ద కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు రాజబాబు మాట్లాడుతూ తమ నివేదికను తెనాలి సబ్ కలెక్టర్‌కు అందజేశామని, బాధిత రైతులకు న్యాయం రిగేటట్లు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పసుపు రైతుల సంఘం నాయకులు ములక శివ సాంబిరెడ్డి, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, తెలుగు రైతు సంఘం అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్‌రెడ్డి ఎల్.భాస్కరరెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ప్ల కార్డులతో రైతులు, మహిళలు ఆందోళన, కౌలు చెల్లించా లంటూ ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద రాజధాని రైతుల ఆందోళన

కౌలు చెల్లించాలని ప్ల కార్డులతో ర్యాలీ

ప్రజాశక్తి - తుళ్లూరు

కౌలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాజధాని రైతులు, రైతు కూలీలు, మహిళా రైతులు తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. రైతుల ఆందోళనకు సిపిఎం రాజధాని డివిజన్ కమిటి మద్దతు తెలిపింది. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు చేస్తున్న దీక్షలు శుక్రవారంతో 1550 వ రోజుకు చేరాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రైతులు, మహిళలు, అసైన్డ్ రైతులు రైతు దీక్షా శిబిరం దగ్గర నుంచి స్థానిక సిఆర్‌డిఎ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సిపిఎం రాజధాని డివిజన్ కమిటి కార్యదర్శి ఎం రవి, నాయకులు పేరం బాబూరావు, కుంభా ఆంజనేయులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం రైతులు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా వార్షిక కౌలు చెల్లింపులో జాప్యం చేస్తోందని మండిపడ్డారు. తక్షణమే రైతులకు, అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజధాని మాస్టర్ ప్లాన్‌ను విచ్ఛిన్నం చేస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవోను ఉపసంహరించు కోవాలని, లేనిపక్షంలో న్యాయపరంగా తేల్చుకుంటామని రైతులు హెచ్చరించారు.

ప్రభుత్వం మభ్య పెడుతోంది : సిపిఎం

ప్రభుత్వం రైతులకు,అసైన్డ్ రైతులకు కౌలు చెల్లిస్తున్నామని ప్రకటనలతో మభ్య పెడుతోందని సిపిఎం రాజధాని డివిజన్ కమిటి కార్యదర్శి ఎం రవి అన్నారు. సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద మాట్లాడుతూ, రైతులకు కౌలు నిమిత్తం రూ. 240 కోట్లు విడుదల చేశామని సి ఆర్ డి ఎ కమిషనర్ కార్యాలయం నుంచి కొద్దినెలల క్రితం ప్రకటన జారీ అయ్యిందని, కానీ ఇంతవరకు రైతుల ఖాతాలో డబ్బులు జమ కాలేదన్నారు. రైతులకు ఇతర ఆదాయ మార్గాలు లేవని, కౌలు చెల్లించక పోతే ఎలా..అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిఐడి విచారణ పేరుతో అసైన్డ్ రైతుల్లో కొంతమందికి మూడేళ్ళ, మరికొంత మందికి రెండేళ్ల నుంచి కౌలు చెల్లించడం లేదని, దళితులు, ఇతర పేద వర్గాలకు చెందిన అసైన్డ్ రైతులు ఉపాధి లేక, కౌలు సొమ్ము దక్కక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రైతులకు, అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఆర్‌డిఎ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

నడిరోడ్డుపై మహిళా కార్మికులు రాత్రిపూట కూడా ధర్నా చేస్తుంటే

ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి

ప్రజాశక్తి - తుళ్లూరు

అసెంబ్లీ , సచివాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ధర్నా రెండవ రోజు శుక్రవారం కూడా కొనసాగింది. గురువారం రాత్రంతా జాగారంతో మల్కాపురం సెంటర్లో రెండవ రోజు కూడా ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ, మహిళలు రాత్రిపూట కూడా నడిరోడ్డుపై కూర్చొని నిరసన తెలియజేస్తూ ఉంటే ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. కనీసం నిరసన తెలియజేసుకోవడం కోసం టెంట్ వేసుకోవడానికి కూడా పర్మిషన్ ఇవ్వలేదని, ఎర్రటి ఎండలో మాడుతూనే ధర్నా నిర్వహించడం, ఇలాంటి ప్రభుత్వాన్ని ఇంతవరకు చూడలేదన్నారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరలేదని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయమని అడుగుతున్నారని, దానిని చేయకపోగా కార్మికుల పట్ల కఠిన వైఖరితో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని, దానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ, కార్మికులు పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకుంటారని, అలా సాధించుకునే క్రమంలో ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నదని వాటికి వెరవకుండా ఐక్యంగా పోరాటాలు చేసినప్పుడే విజయాలు సాధించగలుగుతామని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ అసెంబ్లీ, సచివాలయ పారిశుధ్య కార్మికులు గత ఆరు నెలలుగా అధికారులు, మంత్రుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ వారి సమస్యలను పరిష్కరించక పోవడం సిగ్గుచేటని, ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి కార్మికులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రవి, ఎం భాగ్యరాజ్, సిఐటియు జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు, బి ముత్యాలరావు, అసెంబ్లీ యూనియన్ నాయకులు గ్రేస్, బుజ్జి, యేసుదయమ్మ ,శ్రీలత చిట్టిబాబు , నాగరాజు శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ టి యు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి

మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు

ప్రజాశక్తి - గుంటూరు

మహిళా శక్తిని ప్రోత్సహిస్తే అద్భుతాలను సష్టిస్తారని, అన్ని రంగాల్లో మహిళకు సమాన ప్రాతినిధ్యం కలిగించినప్పుడే దేశ ఆర్థిక ప్రగతి వృద్ధి చెందుతుందని ప్రముఖ న్యాయవాది, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్-గుంటూరు ఆఫీస్, డొమెస్టిక్ వైలెన్స్ సెల్ కౌన్సిలర్ కె.వి. పద్మావతి అన్నారు. చౌడవరంలోని ఆర్‌విఆర్ - జెసి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం కార్యక్రమానికి పద్మావతి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. స్త్రీ హక్కుల పోరాటంలో భాగంగా ఉద్భవించిందే మహిళా దినోత్సవమని, స్త్రీలు ధైర్యంగా తమ సమస్యలపై పోరాడాలని, కుటుంబాన్ని చక్కదిద్దటం మొదలు సమాజ ఔన్నత్యంలో స్త్రీ పాత్ర కీలకమని చెప్పారు. మహిళా సాధికారత సాధించినప్పుడే సమ సమాజ నిర్మాణం జరుగుతుందని అన్నారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ - కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలమన్నారు.ం అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను పద్మావతి ప్రదానం చేశారు. కళాశాలలో నిర్వహించిన 'మిస్ ఇన్ స్పైరర్ కంపిటీషన్-2024'లో అవార్డు దక్కించుకున్న శోభా సిరీనాకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ కిరీటాన్ని అలంకరించారు. కళాశాల అకడమిక్ అండ్ ఆర్-డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ - అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, ఉమెన్ వెల్ఫేర్ కమిటి కన్వీనర్ డాక్టర్ కె.రాధా రాణి, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ జి.సుధావాణి పాల్గొన్నారు.

ఆర్‌విఆర్‌లో ముగిసిన మహిళా దినోత్సవాలు

శోభా సిరీనాకు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు